క్లుప్తంగా

సింహగిరిపై వరద పాయసం సేవ రేపు

సింహాచలం: సింహగిరిపై వైంకుంఠవాసుడి మెట్లపై ఈ నెల 29న వరద పాయసం సేవను నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పడాలని, దేశం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు బాగా పండాలని, భూగర్భ జలాలతో దేశం సస్యశ్యామలంగా ఉండాలని సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్లపై వరద పాయసం సేవ ఏటా నిర్వహించడం పరిపాటి. దీనిలో భాగంగా 29న ఉదయం 8 గంటల నుంచి వరద పాయసం సేవ నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వైభవంగా పునర్వసు నక్షత్ర హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంలో శుక్రవారం హోమాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. హోమగుండం వద్ద మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. స్వామికి విశేష హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రం అందించారు.

మిక్సర్ ట్యాంక్‌లో పడి కూలీ దుర్మరణం


ఓలేటి వెంకట రమణ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ పరిధిలోని వీఎస్ఎల్ వద్ద కోరమాండల్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓలేటి వెంకటరమణ(57) అనే కూలీ దుర్మరణం చెందాడు. వివరాలివి.. పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివసిస్తున్న వెంకటరమణ కోరమాండల్ పెయింట్స్‌లో పని చేస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే పనికి వచ్చిన ఆయన ఫస్ట్ ఫ్లోర్‌లోని బాల్‌మిల్‌లో ఉన్న పెయింట్స్ తయారీ ప్రక్రియలో మిక్సర్ ట్యాంకును శుభ్రం చేసే క్రమంలో దిగాడు. అనంతరం అది రన్ అవడంతో, ఆయన శరీరం మాంస ఖండాలుగా విడిపోయి ఎముకలు, రక్తసిక్తంతో భయానకంగా కనిపించింది. దీనిపై మృతుని కుమారుడు ఆనందపురం పోలీసులను ఆశ్రయించాడు. సీఐ వాసునాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుని శరీర విడిభాగాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. మృతుడు ప్రమాదవశాత్తు పడిపోయాడా, కావాలనే దిగాడా, ఇంకేమైనా జరిగిందా అనే కోణంలో సమగ్ర విచారణ జరపనున్నట్లు సీఐ తెలిపారు. ప్రస్తుతానికి మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌ప్రసాద్‌రాజా

పెదగంట్యాడ: వాతావరణ మార్పుల నేపథ్యంలో పిల్లలు, పెద్దలు డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఎండలో పనిచేసే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ రోడ్ల పక్కన విక్రయించే ఆహారం తీసుకోవద్దన్నారు. బాలింతలు చిన్నపిల్లలకు ఆరు మాసాలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. సిబ్బంది కె.అన్నపూర్ణ, ఎం. శ్రీనివాసరావు, హెచ్ఎస్ గోపాల్, ఎన్.సునీత, ఎం. దేవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు.. కలెక్టర్.. ఓ తహసీల్దార్!



- పెందుర్తి తహసీల్దార్ పోస్టుపై రాజకీయ దోబూచులాట
- గత తహసీల్దార్‌ను బలవంతంగా సాగనంపిన కూటమి ప్రజాప్రతినిధి
- అవినీతి ఆరోపణలతో కొత్త తహసీల్దార్‌ను వెనక్కి పంపిన కలెక్టర్?
- అయిష్టంగానే ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న డీటీ సంతోష్‌కిరణ్
- రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించేందుకు మీనమేషాలు
- పెందుర్తి రెవెన్యూ పరిధిలో పెరిగిపోతున్న భూ కబ్జాలు

జిల్లాలో అత్యంత కీలకమైన రెవెన్యూ మండలం పెందుర్తి. కూటమి నేతల నిర్వాకంతో తహసీల్దార్ నియామక ప్రక్రియ అర్థంతరంగా నిలిచి, ఉన్నతాధికారులకు కత్తిమీద సాములా మారింది. మూడు వారాలుగా మండలానికి తహసీల్దార్ లేరు. దీంతో పెందుర్తి పరిధిలో రెవెన్యూ సంబంధిత కీలక కార్యకలాపాలు స్తంభించాయి. భూముల మ్యుటేషన్లు, ఇతర పనులు ఆగిపోయాయి. తహసీల్దార్ చేతుల మీదుగా జారీ చేయాల్సిన ధ్రువపత్రాలు నిలిచిపోయాయి. ఇదే అదనుగా ఎక్కడికక్కడ కూటమి నేతలు భూ కబ్జాల్లో మునిగితేలుతున్నారు.

పెందుర్తి: కూటమి ప్రభుత్వానికి చెందిన నలుగురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతల జోక్యంతో మండల తహసీల్దార్ నియామకం నిలిచిపోయింది. ఎవరిని సంతృప్తి పరచాలో తెలియక ఉన్నతాధికారులు మిన్నకుండిపోయారు. దీంతో రెవెన్యూ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీ భూ వైశాల్యం కలిగిన పెందుర్తిలో ప్రభుత్వ భూములు చేజారిపోతున్నాయి. ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములపై కూటమి నాయకులు, కబ్జాదారులు గద్దల్లా వాలిపోతున్నారు. ఇంత జరుగుతున్నా తహసీల్దార్ నియామకంపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన కానరావడం లేదు.

ఇక్కడే ఎందుకిలా?

ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధిక భూభాగం కలిగిన రెవెన్యూ మండలాల్లో పెందుర్తి ఒకటి. మరోవైపు నగరంలోనే అత్యంత కీలకమైన మండలం ఇది. జనాభా కూడా ఎక్కువే. అలాంటి కీలకమైన మండలంపై ప్రస్తుతం పర్యవేక్షణ లేకుండా పోయింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ నెల 9న పెందుర్తి తహసీల్దార్‌గా ఉన్న ఎం.ఆనంద్‌కుమార్‌ను బదిలీ చేశారు. ఈ బదిలీ వెనుక స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఒత్తిడి ఉందన్న ప్రచారం జరిగింది. అదే సమయంలో అల్లూరి జిల్లా నుంచి ఎమ్మెల్యే పంచకర్ల ఏరికోరి తెచ్చుకున్న రామకృష్ణపై గతంలో ఆరోపణలు ఉండడంతో, అతన్ని కలెక్టర్ పెందుర్తి బాధ్యతలు ఇవ్వకుండా వెనక్కి పంపారు. దీని తర్వాత వేరొక తహసీల్దార్ నియామకంపై ఎటూ తేల్చని పరిస్థితి. ఎమ్మెల్యే పంచకర్ల సూచించిన తహసీల్దార్ నియామకానికి అవినీతి ఆరోపణలు అడ్డురావడం, మరోవైపు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ సూచించిన తహసీల్దార్‌ను నియమించేందుకు ఇతర ఇబ్బందులుండటంతో ఉన్నతాధికారులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారని ప్రచారం జరుగుతోంది.


పెందుర్తి రెవెన్యూ కార్యాలయం


తహసీల్దార్ కార్యాలయం గది

నిలిచిన కార్యకలాపాలు

రెగ్యులర్ తహసీల్దార్ లేకుండా మూడు వారాలవుతోంది. ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా.. అదీ పరిమిత అధికారాలే. తహసీల్దార్ మాత్రమే జారీ చేయాల్సిన పత్రాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో భూములకు సబంధించిన మ్యుటేషన్లు, ఇతర కీలక పనులు ఆగిపోయాయి. విద్యార్థులకు ఉన్నత విద్య ప్రవేశాల కౌన్సెలింగ్, ఉద్యోగ నియామకాల్లో కీలకంగా ఉండే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కావట్లేదు. మరోవైపు సందట్లో సడేమియాలా ఇప్పటికే భూ కబ్జాలతో రెచ్చిపోతున్న కబ్జా గ్యాంగ్‌లు మరింతగా విజృంభిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెందుర్తి రెవెన్యూకు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు ఇన్‌చార్జి బాధ్యతలు!

రెగ్యులర్ తహసీల్దార్ నియామకం జాప్యం కావడంతో ప్రస్తుత డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కిరణ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించేందుకు మౌఖిక ఆదేశాలిచ్చారు. అయితే ఆయన ఆ బాధ్యతలు తీసుకునేందుకు శుక్రవారం వరకు నిరాకరించారు. ఉన్నతాధికారుల బలవంతం మేరకు అయిష్టంగానే శుక్రవారం ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ తహసీల్దార్‌తో సంబంధంలేని చిన్నా చితకా పనులకు ఇబ్బంది లేకుండా ఆయన కానిచ్చేశారు. మొత్తానికి కూటమి ప్రభుత్వ రాజకీయానికి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థిక సాయం


రామునాయుడుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పరవాడ/అనకాపల్లి: పరవాడ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందిన కె.రామునాయుడుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల హోం గార్డులు ఒక రోజు వేతనం రూ.4,04,965 అందజేశారు. ఈ మొత్తం చెక్కును ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం తన కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పదవి వీరమణ పొందినా, అనారోగ్య కారణంగా మృతి చెందినా హోంగార్డుల ఒక రోజు వేతనాన్ని స్వచ్ఛందంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. హోంగార్డులు పోలీస్ శాఖలో ఒక భాగమేనన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఏ రామ్ కుమార్, సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా విస్తృత సమావేశం


కోన రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

పరవాడ: అనకాపల్లి రింగ్ రోడ్డు, బెల్లం మార్కెట్‌లోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో శనివారం జరగనున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ మండల నాయకులు హాజరు కావాల్సిందిగా మండల అధ్యక్షుడు కోన రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సమావేశానికి పార్టీ మండల ముఖ్య నాయకులు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షుడు హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

30 వసంతాలు పూర్తిచేసుకున్న జాగృతి సంస్థ



జాగృతి వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న నాబార్డు డీడీఎం సమంత్ కుమార్, పాలకవర్గ సభ్యులు

- రూ.19.81 లక్షల నికర లాభం ఆర్జించినట్లు వెల్లడి

సబ్బవరం: జాగృతి సంస్థ అంచెలంచెలుగా ఎదిగి ఈ స్థాయి అభివృద్ధి సాధించిందని, మరింత అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని నాబార్డు డీడీఎం సమంత్ కుమార్ తెలిపారు. జాగృతి సంస్థ 30వ ప్రాతినిధ్య మహాజనసభ స్థానిక ఓ ప్రైవేట్ కన్వెన్షన్ సెంటర్లో శుక్రవారం జరిగింది. జాగృతి సంస్థ 30 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. సాంకేతికంగా బాగా పనిచేస్తున్నారని, మరింత పురోగతి సాధించాలని అభిలషించారు. పాలకవర్గం ఎన్నిక నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా మారెడుపూడి అబద్దం, వైస్ ప్రెసిడెంట్‌గా కొటాన సుజాత, మేనేజింగ్ డైరెక్టర్‌గా కందర్ప సుజాతను సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 30వ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. వార్షిక నివేదికలోని ముఖ్యాంశాలను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చదివి వినిపించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంస్థలో 22,229 మంది సభ్యులున్నారని, సంస్థ టర్నోవర్ రూ.34.36 కోట్లు, సభ్యులు దాచుకున్న పొదుపు రూ.30.85 కోట్లుగా వెల్లడించారు. సభ్యుల షేర్ ధనం రూ.45.78 లక్షలు, సంస్థ నుంచి సభ్యులు అప్పుగా పొందిన మొత్తం రూ.41.27 కోట్లుగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.19.81 లక్షల నికర లాభం ఆర్జించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంఏ రహీం, అనకాపల్లి చెరకు పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ముకుందరావు, సంస్థ సీఈవో కందర్ప మౌక్తిక, ఆడిటర్ వి.సుధాకర్, పాలకవర్గ సభ్యులు, ప్రతినిధులు, పలు మండలాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

అభయ వెంకన్నకు అభిషేక పూజలు


శ్రీభూసమేత అభయ వేంకటేశ్వరస్వామికి అభిషేక పూజలో అర్చకులు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పరవాడ: మండలంలో ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన భూ సమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణాచార్యులు ఆధ్వర్యంలో వెంకన్నకు 108 కలశాలతో ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. ఈ.బోనంగి, బొద్దపువానిపాలెం, ఫార్మాసిటీ కాలనీ పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు దంపతుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు జరిగాయి.

ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు లాలం అప్పలనాయుడు, మేడిశెట్టి బాలాజీనాయుడు, సత్యనారాయణ, నారాయణ, నాయుడు, ధనరాజు, లోవరాజు, శేఖర్, దీపిక దంపతులు పాల్గొన్నారు.

గృహ లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి


లే అవుట్‌లో తుప్పపట్టిన ఐరన్‌ను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, తదితరులు

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి

సబ్బవరం: నివాస యోగ్యమైన గృహ నిర్మాణాలను చేపట్టి పేదలకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పైడివాడ అగ్రహారంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదగా ఏర్పాటు చేసిన మెగా లేఅవుట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల గృహ నిర్మాణాలకు ఒక్కొక్కరికి అదనంగా రూ.50 వేలు ప్రభుత్వం ఇవ్వనుందన్నారు. గృహ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నాణ్యత లేని సిమెంట్, ఇసుక, ఐరన్ వాటిని అవసరమైతే వెనక్కి పంపించాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై రిపోర్టు సిద్ధమై సీఎం వద్ద ఉందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణంలో ఉన్న ఈ లేవుట్‌కు అవసరమైన విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సబ్బవరం లే అవుట్‌కు రూ.150 కోట్లు వరకూ నిధులు కేటాయించామని, రూ.70 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. లే అవుట్‌లోని గృహ నిర్మాణాలను, మోడల్ హౌస్‌ను పరిశీలించారు. నిర్మాణాలకు వినియోగిస్తున్న ఐరన్‌ను పరిశీలించి తుప్పు పట్టి ఉండటాన్ని గుర్తించి కాంటాక్టర్‌ను ఆరా తీశారు. నాణ్యతా పరీక్షలను నిర్వహించాకే వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, ఎంపీటీసీ అప్పలరాజుతో పాటు గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుతో వాహనదారుల ఇక్కట్లు


గోతులతో నిండిన ఫార్మాసిటీ రోడ్డు

పరవాడ: లంకెలపాలెం–పరవాడ రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారిలో బూడిద, బొగ్గు లోడ్లతో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఏ మాత్రం వర్షం పడినా గుంతల్లో నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడి ఏడాది కావస్తున్నా.. మరమ్మతులకు నోచుకోలేదన్నారు. ఫార్మా పరిశ్రమల్లో పనిచేసే వేలాది కార్మికులు, ఉద్యోగులు రాత్రి సమయంలో విధులు ముగించుకుని ఇళ్లకు చేరే క్రమంలో గతుకుల రోడ్డులో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో గుంతలు కనిపించక కొందరు ప్రమాదాల బారిన పడినట్లు పేర్కొన్నారు. రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని కూటమి నేతలు గుప్పిస్తున్న హామీలు ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయని ప్రయాణికులు ఆక్షేపిస్తున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి, అధ్వానంగా మారిన ఫార్మాసిటీ రోడ్డులో గుంతల్ని తాత్కాలికంగానైనా పూడ్చాలని ఫార్మా ఉద్యోగులు, కార్మికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 8 మందికి కోర్టు రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో రోడ్డు భద్రతా చర్యలు

- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా


రోడ్డు భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పరవాడ: రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో ఈ నెల 23న జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రమాదం తీరు తెన్నులను ట్రాఫిక్ పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు భద్రత పరిరక్షణ చర్యలపై రోడ్డు ఇంజినీరింగ్‌లో తగు మార్పులు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా రవాణాశాఖ అధికారి జి.మనోహర్, పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్‌లతో సమీక్ష జరిపారు. అలాగే ప్రమాద స్థలంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు, వేగ నియంత్రణ, సిగ్నల్ వ్యవస్థ నిర్వహణ, ప్రమాదకరంగా ఉన్న మలుపులు, డివైడర్లు, సైన్ బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష జరిపి, సూచనలిచ్చారు. ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మృత్యువాత పడగా 15 మంది గాయపడ్డారని, క్షతగాత్రులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పోలీసు అధికారులు ఎస్పీకి వివరించారు. సమీక్షలో రవాణా శాఖాధికారి జి.మనోహర్, పరవాడ సబ్‌డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, పి.గోపీకృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు ఒడిశా దాసుడి ఊంజల్ సేవ


ఉయ్యాలను ఊపుతున్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్, దేవస్థానం ఈవో త్రినాథరావు


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఒడిశా భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఊంజల్ సేవ ఘనంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ స్వామికి ఈ సేవను విశేషంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో ఒడిశా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కల్యాణమండపంలో శేషతల్పంపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. పుష్పాలతో ద్వాదశి ఆరాధనతో స్వామిని కొలిచారు. లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు స్వామి వేంజేసిన ఉయ్యాలను ఊపారు. ఒడిశా భక్త బృందం కీర్తనలతో స్వామిని సేవించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈ సేవను నిర్వహించారు.

డిమాండ్ల సాధనకు నీటి సరఫరా కార్మికుల సమ్మె


వేపగుంట జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న వాటర్ సప్లై కార్మికులు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 పరిధిలోని నీటి సరఫరా కార్మికులు తమ జీతాలు పెంచడంతో పాటు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. వేపగుంట జంక్షన్‌లో సమ్మెకు దిగిన కార్మికులు శుక్రవారం తమ డిమాండ్లు సాధన కోసం ఆందోళనకు దిగారు. రూ.15 వేల జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల సమస్యను కార్పొరేటర్ల దృష్టికి తీసుకెళ్తే, మే నెల నుంచి కొత్త జీతాలు చెల్లించాలని కౌన్సిల్లో తీర్మానం చేసినా.. అధికారులు పాత జీతాలే చెల్లించారని ఆక్షేపించారు. దీంతో జీవీఎంసీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆనందరావు, ప్రధాన కార్యదర్శి సత్యం ఆదేశాల మేరకు వాటర్ సప్లై కార్మికులు సమ్మెకు దిగినట్లు పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కారించే వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు.